# టీచర్ చెంచురెడ్డికీ, అతని తోబుట్టువులకూ జరిగిన అన్యాయాన్ని ఖండించండి!

# వాళ్ల ఆస్తులను బలాత్కారంగా లాక్కున్న దౌర్జన్యకారులకు అండగా నిలబడిన పెద్దమనుషుల దుర్మార్గాన్ని ఎండగట్టండి!

★

ప్రజలారా!

ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించేవాళ్లు సమాజంలో పెద్దమనుషులుగా, రాజకీయాలలో నాయకులుగా ఎదగడం సహజం. అట్లు పైకొచ్చిన పెద్దమనుషుల గురించి, నాయకుల గురించి మనం కథలు వింటూంటాం.

కథలే ఎందుకంటే ఇప్పుడు పెద్దమనుషులుగా, నాయకులుగా చలామణి అవుతున్నవాళ్లు అటువంటివాళ్లు కారుకాబట్టి. పోనుపోను బహుశా అటువంటి కథలు వింటే మనము నమ్మమేమోకూడ. హత్యలు చేయించి పైకి వస్తారు, ఒకరి ఆస్తి ఒకరికి అప్పజెప్పి పైకి వస్తారు, బకాసురుడి విందుకు అమాయక ప్రాణులను ఆహారంగా పంపించి పైకి వస్తారు, అంతేకానీ నలుగురికి మంచి చేసి ఎవడయినా సమాజంలో పెద్దమనిషి అవుతాడా? రాజకీయ నాయకుడవుతాడా? అని పోనుపోను మనమే అడుగుతామేమో!

## ఉదాహరణకు ఈ కథ వినండి

ప్రొద్దుటూరు పట్టణంలో మోపూరు నల్లోబన్నగారి యెల్లారెడ్డి అనే ఆయన ఉండేవాడు. ఆయనకు అయిదుగురు పిల్లలు. పెద్దకొడుకు ఓబుల్‌రెడ్డి, రెండవ కొడుకు యెల్లారెడ్డి, మూడవ కొడుకు చెంచురెడ్డి. కూతుర్లు యెల్లమ్మ (ఉరఫ్ అక్కయ్య), రామలక్ష్మమ్మ. తండ్రి బ్రతికి వుండగానే పెద్దకొడుకు ఓబుల్‌రెడ్డి ఆస్తి పంపకం చేసుకొని తన వాటా తీసుకున్నాడు. ఇది జరిగింది 1957లో. పెద్దకొడుకు భాగం పంచుకునే నాటికి చెంచురెడ్డి మైనర్ కాబట్టి వీళ్లందరి భాగం రెండవ కుమారుడు యెల్లారెడ్డి నిర్వహణలోనే ఉండింది. క్రమముగా వీరు కష్టపడి ఆస్తిని అభివృద్ధి పరచుకొన్నారు.

భాగం పంచుకొని పోయిన పెద్దకొడుకు ఓబుల్‌రెడ్డి నారాయణమ్మ అనే స్త్రీని రెండవ పెండ్లి చేసుకున్నాడు. ఆమె ప్రొద్దుటూరులోని 'పెద్దమనుషుల'లో తిరుగులేని వారయిన కోవూరి కొండారెడ్డిగారి సోదరి. ఆలయ ధర్మకర్త, ఎరువుల వ్యాపారి, కాంట్రాక్టర్ అయిన కొండారెడ్డిగారి కుటుంబ సభ్యుల పెత్తనం, జబ్బబలం, ప్రొద్దుటూరు పట్టణ ప్రజలకు తెలియనిదికాదు.

ఓబుల్‌రెడ్డికీ నారాయణమ్మకూ పుట్టిన కుమారుడు నరసింహారెడ్డి ప్రస్తుత ప్రొద్దుటూరు ఎం.ఎల్.ఏ. వరదరాజులురెడ్డిగారి సోదరిని వివాహం చేసుకున్నాడు. ఈ విధంగా బలము, పలుకుబడి, అధికారం వారి పక్షమయిన తరువాత తల్లీకొడుకులు యెల్లారెడ్డి నిర్వహణలో వున్న ఆస్తిమీద కన్నువేశారు. ఓబుల్‌రెడ్డి, యెల్లారెడ్డి, 1988లో ఒక నెలరోజుల తేడాతో చనిపోయారు. ఆనాటినుండి చెంచురెడ్డి, యెల్లమ్మ, రామలక్ష్మమ్మల కష్టాలు మొదలయ్యాయి.

తల్లీకొడుకులు వీళ్లను నిస్సహాయులను చేసి వీళ్లమీద దాడి చేయసాగారు. రెండుసార్లు దాడి జరిగిన తరువాత చెంచురెడ్డి 5-6-1988 నాడు అప్పటి కడప జిల్లా ఎస్.పి. అయిన అరవిందరావుగారికి అర్జీ పెట్టుకున్నాడు. తనకూ తన అక్కలిద్దరికీ రక్షణ కల్పించాలనీ, తమను హతమార్చి ఆస్తి కాజేస్తారని భయంగా వుందనీ, విన్నవించుకున్నాడు. అరవిందరావుగారు అంతా విని 'ఎం.ఎల్.ఏ. జోక్యం చేసుకోకుండ చూస్తే నేను సహాయం చేయగలను' అని చెప్పి పంపించాడట! అంత స్వతంత్రులు మన పోలీస్ అధికారులు.

(త్రిప్పి చూడుము)

ఇక గత్యంతరం లేక చెంచురెడ్డి తన ప్రత్యర్థులతో 'చర్చలకు' ఒప్పుకున్నాడు. తాను వాళ్లకేమీ బాకీలేకున్నా వాళ్లకు ఇష్టమున్న పెద్దమనిషితోనే పంచాయితీ జరిపించమన్నాడు. పంచాయితీ 22-2-1989 నాడు జరిగింది. పెద్దమనుషులలో ఒకరు ప్రస్తుత రెవెన్యూ మంత్రి డి. ఎల్. రవీంద్రరెడ్డిగారు, బండారు వెంకటసుబ్బయ్యగారు వీరిద్దరూ కలిసి నిర్వహించిన పంచాయితీలో యెల్లారెడ్డి, చెంచురెడ్లు సంపాదించిన ఆస్తినేకాక, వాళ్ల తల్లిగారి నుండి సంక్రమించిన ఆస్తినికూడ మొత్తం నరసింహారెడ్డి, నారాయణమ్మ, సావిత్రమ్మలు రాయించుకున్నారు. సిగ్గుమాలిన ఈ దౌర్జన్యానికి సాక్ష్యంగా 'హక్కు విడుదల పత్రాన్నికూడా ఒకేదినములో సబ్‌రిజిస్ట్రారుగారు కొండారెడ్డి పలుకుబడితో రిజిస్టర్ చేయించారు. ఇంత దౌర్జన్యం ఎందుకు చేయించావని ప్రస్తుత రెవెన్యూ మంత్రిని చెంచురెడ్డి కళ్లలో నీళ్లు పెట్టుకొని అడగగా, తాను చేసిన పంచాయితీ దుర్మార్గమయినదని తనకు తెలుసుననీ, అయితే నరసింహారెడ్డి తనకివ్వవలసిన బాకీ సాధించుకొనడానికి ఇంతకంటే మార్గం కనబడక ఈపని చేసాననీ అన్నారట. అన్నట్లే, 'హక్కుదానం' రిజిష్టరు జరిగిన తక్షణమే తన బాకీ తీసుకొని తాను పోయాడట.

చెంచురెడ్డి, యెల్లమ్మ, రామలక్ష్మమ్మ, ఆస్తిని 'పెద్దమనుషుల' పుణ్యాన నారాయణమ్మకూ, నరసింహారెడ్డికీ సమర్పించి బిక్కుబిక్కుమని బ్రతుకుతున్నారు. 'హక్కు దానపత్రం'లో తాము నివసిస్తున్న ఇల్లు యెల్లమ్మ, రామలక్ష్మమ్మల మరణానంతరం నరసింహారెడ్డికి చెందుతుందని రాసుకున్నారు. కాబట్టి అసహాయులయిన ఆ మహిళలిద్దరినీ చంపేసి ఇంటిని ఆక్రమించుకుంటారేమోనని భయపడుతున్నారు. ఆలస్యంగా పెళ్లి చేసుకొని ఇద్దరు పిల్లల తండ్రి అయిన చెంచురెడ్డి తన భార్యా పిల్లలకు ఏగతి పడుతుందో అని భీతిల్లివున్నాడు.

సమాజంలోని పెద్దమనుషులూ, రాజకీయ నాయకులూ, ప్రజా ప్రతినిధులూ, అమాత్యులూ దౌర్జన్యకారుల పక్షమయితే అన్యాయం జరిగిందని చెప్పుకొనడానికీ, న్యాయం చేయమని కోరడానికీ దిక్కెవరూలేక ఈ అభాగ్యులు ముగ్గురూ నోరు నొక్కుకుని తామే నేరస్తులయినట్టు నక్కినక్కి బ్రతుకుతున్నారు. ఎవరితో మాట్లాడితే తప్పవుతుందో ఎవరికి చెప్పుకుంటే నేరమవుతుందోనని మూగజీవితాలు సాగిస్తున్నారు.

పౌర హక్కుల సంఘం ప్రోద్బలంతో యెల్లమ్మ అక్టోబర్ 24వ తేదీన కడప జిల్లా ఎస్.పి.ని కలిసి తన గోడు వెళ్లబోసుకుంది. తమ ఆస్తికీ. ప్రాణానికీ రక్షణ కల్పించమని కోరింది. పత్రికా విలేకరులకుకూడ తన గోడు విన్నవించుకుంది. బలవంతులంతా అన్యాయం పక్షమయి దౌర్జన్యాలకు వత్తాసు పలుకుతూవుంటే బలహీనుల గొంతు వినిపించడానికి పత్రికలే శరణ్యం అని ఆమె నమ్మింది. అయితే మన ప్రజాస్వామ్యంలో మిగిలిన వ్యవస్థలు ప్రజలకు ఎంతమాత్రం అండనిస్తున్నాయో పత్రికలూ అంతకంటే ఎక్కువ ఇచ్చే స్థితిలో లేవు. రాయలసీమను ఏలుతూన్న కొత్త పాలెగాళ్ల దుర్మార్గాలను ఎండగట్టేంత 'పత్రికా స్వేచ్ఛ' మనకింకా రాలేదు.

అందుకే ఈ కుటుంబ గాథను ప్రజల దగ్గరికి ఈ రూపంలో తీసుకుపోతున్నాము. పెద్దమనుషులుగా, నాయకులుగా, ఎం.ఎల్.ఏలుగా, మంత్రులుగా చలామణి అవుతూన్న వాళ్ల అండ చూసుకొని దుర్మార్గాలు సాగిస్తూన్నవాళ్లు అన్ని వూళ్లలో అన్ని గ్రామాలలో వున్నారు. ఈ దౌర్జన్యం నుండి మనం విముక్తి పొందనిదే మనకు స్వాతంత్ర్యం వచ్చినట్టుకాదు, ప్రజాస్వామ్యం దక్కినట్టుకాదు. ఈ విముక్తి కోసం కదలి రమ్మని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

చెంచురెడ్డి, యెల్లమ్మ, రామలక్ష్మమ్మల ఆస్తిని దౌర్జన్యంగా స్వంతం చేసుకున్న వారికీ, వారికి అండగా వున్న పెద్దమనుషులకూ ఒక హెచ్చరికకూడ చేస్తున్నాం. వారికి జరిగిన అన్యాయాన్ని బయటపెట్టి ప్రభుత్వం దృష్టికీ ప్రజల దృష్టికీ తీసుకుపోయినందుకు వాళ్లమీద ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోము. సమస్యను ఎంత దూరమయినా తీసుకుపోయి అన్యాయానికి పరిహారం జరిగేటట్టు చూస్తాం.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

కడప జిల్లా.

---

గాయత్రి ప్రింటర్స్, ప్రొద్దుటూరు.